క్లుప్తంగా

పోస్టల్ ఓటింగ్



సిరా గుర్తును చూపుతున్న ఉపాధ్యాయులు

కొడంగల్ : మండల పరిధిలో పలు గ్రామాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు సోమవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. ఈనెల 13న ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. ఓటు వేసిన వారిలో ఉపాధ్యాయులు బాకారం చంద్రశేఖర్, బాకారం మల్లయ్య, మొగులప్ప, హకీం బాల్‌రాజ్, పృథ్వీసింగ్, వెంకటప్ప, సంఘమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొడంగల్ రూరల్ : సోమవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు లింగాష్టక పారాయణం చేశారు. అనంతరం శివలింగానికి సైతం పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, శివాష్టకం, లింగాష్టకం, శివాష్టోత్తర శత నామావళి, దూపం, దీపం, నైవేద్యాలను సమర్పించారు.

బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం

యాలాల: మండల పరిధిలోని ముద్దాయిపేటలో బీఆర్‌ఎస్ గ్రామ కార్యాలయాన్ని పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఆచరణకు అమలు కానీ హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ స్టిక్కర్లను గోడలకు అంటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

సత్యసాయి.. సేవలు కొనసాగిస్తాం



మజ్జిగ పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

పరిగి: పేదలకు అవసరమైన సేవలను సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యం కొనసాగిస్తామని సమితి సభ్యులు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. స్వామి వారి తల్లి ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా కార్యక్రమం చేపట్టామన్నారు. సమితి సభ్యులు బాబు, లింగప్ప, వేణుగోపాల్, ప్రీతం, వీరేందర్, విజయలక్ష్మి, సుమలత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ



అంబలిని పంపిణీ చేస్తున్న నాయకులు

యాలాల: మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం తైద అంబలిని పంపిణీ చేశారు. వారాంతపు సంత కావడంతో ప్రజలకు దాహార్తి తీర్చేందుకు అంబలిని పంపిణీ చేస్తున్నామని కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా తెలిపారు.

మాజీ ఎంపీటీసీల చేరికలు

పరిగి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఆధ్వర్యంలో గండీడ్, మహ్మదాబాద్ మండలాలకు చెందిన ఆరుగురు మాజీ ఎంపీటీసీలు బీజేపీలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ, గ్రామీణ స్థాయిలో బీజేపీకి మరింత బలం చేకూరుతుందన్నారు.

పోటాపోటీగా ప్రచారం

పెద్దేముల్: మండలంలో బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రచారం జోరందుకుంది. నువ్వా నేనా అన్నట్లు ఇరు పార్టీల నాయకులు ప్రచారం చేస్తున్నారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ, ఈసారి రాహుల్ పీఎం అవుతారని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి.

‘పందిరి’ నిధుల పరేషాన్

- బిల్లుల కోసం రెండేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపు
- ఎన్‌ఆర్‌జీఎస్ కింద చేపట్టిన నిర్మాణాలు



కూరగాయల పందిరి

పెద్దేముల్: కూరగాయల పందిళ్లు నిర్మిస్తే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజురు కాలేదు. అసలు బిల్లులు వస్తాయా లేవా? అని అధికారులను లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నా సరైన సమాధానం రావడం లేదని వాపోతున్నారు. విషయానికొస్తే..రెండేళ్ల క్రితం పెద్దేముల్ గ్రామాలకు చెందిన పలు గ్రామాల రైతులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద కూరగాయల పందిరి, కల్లాలు నిర్మించారు. నెల రోజులకే నిధులు వస్తాయని అధికారులు చెప్పడంతో కల్లాలతోపాటు కూరగాయల పందిళ్లు ఏర్పాటు చేసుకున్నారు.ఏడాది తరువాత కల్లాలకు ప్రభుత్వం నిధులు మంజురు చేసింది. కానీ కూరగాయల పందిళ్లకు మాత్రం మంజురు చేయలేదు. ఈ విషయమై సంబంధిత అధికారులను అడిగితే బిల్లులు వస్తాయని చెప్పడం లేదు. దీంతో రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా పనులను చేపట్టడానికి జంకుతున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి పందిళ్లు వేస్తే నిధులు మంజురు చేయక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. త్వరలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ విషయమై ఉపాధి ఏపీఓ నర్సింహులును వివరణ కోరగా త్వరల్లో బిల్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పార్టీలు



పరిగి పట్టణంలో ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసానిని గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పిలుపు

పరిగి: బీజేపీ, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక, ప్రజలను మోసం చేసే పార్టీలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఇంటింటికి తిరిగి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు చెప్పిందొకటి అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తుందొకటన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న ఆపార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పూర్తి విఫలమైందన్నారు. మరోవైపు బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ మరింతగా పెరిగిందన్నారు. ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పోరాడే ది ఒక్క బీఆర్‌ఎస్సేనని అన్నారు. పార్టీకి ప్రజలు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపిస్తే పార్లమెంట్‌లో మన ప్రాంత సమస్యలపై ప్రశ్నించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, మండలాధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరుపున కుల్కచర్ల మండల గౌడ సంఘం మండల అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకులు మాలె కృష్ణయ్య గౌడ్ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. నిరుపేదల గొంతుకగా, బహుజన ప్రజల వారధిగా కాసాని చేసిన కృషిని గుర్తించిన మాజీ సీఎం కేసీఆర్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ ఆలోచించి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సత్యయ్య, కాంగారి బాలు, లక్ష్మయ్య, జె.వెంకటయ్య, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం

బొంరాస్‌పేట: బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రచారం ముమ్మరం చేశారు. ఆదివారం మండలంలోని రేగడిమైలారం, లింగన్‌పల్లి, బురాన్‌పూర్, మదన్‌పల్లి, మేడిచెట్టుతండా, బోడబండతండా, సూర్యానాయక్‌తండా తదితర గ్రామాలు, తండాల్లో మండల పరిధిలోని జరిగిన ప్రచారంలో వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ శేరినారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, దేశ్యానాయక్, గ్రామ అధ్యక్షుడు శ్యామలయ్యగౌడ్, గోవింద్‌రెడ్డి, దశరథ్, వెంకటయ్య పాల్గొన్నారు.

మతతత్వ పార్టీని తరిమికొట్టాలి

సీపీఐఎంఎల్ డివిజన్ కార్యదర్శి మల్లేష్

పరిగి: మతతత్వ పార్టీ బీజేపీని తరిమికొట్టాలని సీపీఐ ఎంఎల్ డివిజన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ ఇండియా కూటమికి మద్దతు ఇస్తుందన్నారు. ఇండియా కూటమి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఏమి చేయలేదన్నారు. కార్పొరేట్ చేతుల్లో దేశాన్ని తాకట్టు పెడుతున్నందున కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించే లక్ష్యంగా తాము పనిచేస్తామన్నారు. దేశంలోని సబ్బండ వర్గాల ప్రజలు ఆపార్టీని నమ్మె పరిస్థితిలో లేరన్నారు. ఇటు రైతులు అటు వ్యాపారస్తులను మోసం చేసి నిలువు దోపిడీ చేసిందన్నారు.

9న సర్వసభ్య సమావేశం

బొంరాస్‌పేట: ఈనెల 9న గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభకానున్న సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది పాల్గొనాలన్నారు. ప్రత్యేక పాలనలో చేపట్టిన గ్రామస్థాయి అభివృద్ధి పనులు, నివేదికలు, చేపట్టాల్సిన పనులకు సంబంధించిన సమాచారంలో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

కాంగ్రెస్ ముమ్మర ప్రచారం



బొంరాస్‌పేట: కాంగ్రెస్‌లో చేరిన రవీందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: కాంగ్రెస్ నేత ఎనుముల తిరుపతిరెడ్డి సమక్షంలో దుద్యాల మండలం లగచర్లకు చెందిన మాజీ ఎంపీటీసీ స్వాతి, రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖరయ్య ఆధ్వర్యంలో చేరారు. బీఆర్‌ఎస్ మెట్లకుంట మండల నాయకుడు రమణారెడ్డితోపాటు పలువురు నాయకులు కూడా చేరారు. ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు జయకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పార్టీ మండలాధ్యక్షుడు నర్సింహులుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సింహులు నాయుడు, హాజీమలాంగ్‌బాబా, రాములు హర్షం వ్యక్తం చేశారు.

గాంధీనగర్‌లో..

కొడంగల్ : మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్‌లో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి సోమవారం ప్రచారం చేశారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, సోమశేఖర్, నయీమ్, దాము, మునీర్, మురహరి వశిష్ట తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ : ప్రజలతో మాట్లాడుతున్న జగదీశ్వర్‌రెడ్డి

ఏఎంసీ చైర్మన్ ఎల్.శశాంక్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, కౌన్సిలర్ సురేష్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దోమ: కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తల పని చేయాలని బొంపల్లి మాజీ సర్పంచ్ కోళ్ల సురేష్, మాజీ ఏఎస్‌ఐ అంతిరెడ్డి అన్నారు. సోమవరం మండల పరిధిలోని బొంపల్లిలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిరుపేదల జీవితాల్లో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో బొయిని చంద్రశేఖర్, ఆయా పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు,

రంజిత్‌రెడ్డికి మద్దతుగా..

మోమిన్‌పేట: మండల పరిధిలోని రాళ్లగుడుపల్లిలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీ రంజిత్‌రెడ్డికి మద్దతుగా పార్టీ మండలాధ్యక్షుడు శంకర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలంటే ఎంపీ ఎన్నికలలో రంజిత్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: వికారాబాద్ మండలం సిద్దులూర్ ఎంపీటీసీ గౌసొద్దీన్, రైతుబంధు అధ్యక్షుడు హరిమోహన్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుర్గయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గౌస్, మైనార్టీ అధ్యక్షుడు ఛోటే మియా తమ అనుచరులతో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎంపీ అభ్యర్థికి మండలం నుంచి భారీ మెజార్టీ ఇస్తామన్నారు.

మాతోనే అభివృద్ధి సాధ్యం

ఈ ప్రాంత అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని గంగారంలో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజిత్‌రెడ్డిని గెలిపించుకొని సీఎంకు బహుమతిగా ఇస్తామన్నారు. మాజీ

గంగపుత్రుల మద్దతు

ధారూరు: కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ధారూరు మండల పరిధిలోని తరిగోపుల, మున్నూరు, సోమారంల్లో స్పీకర్ తనయ అనన్య చేతన్, ఎంపీ తనయుడు సిద్ధార్థ్‌రెడ్డి, నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు.

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు చౌడాపూర్ మండలం మరికల్ గ్రామ గంగపుత్రుల సంఘం మద్దతు ప్రకటించింది. మద్దతు తెలిపిన వారిలో సంఘ అధ్యక్షుడు పోమాల యాదయ్య, మరికల్ మాజీ సర్పంచ్ పాండురంగయ్య, సంఘ కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు శ్రీకాంత్, నర్సింహులు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యాలాల: కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని సంగెంకుర్దు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోలుకుంది హన్మంతు అన్నారు. ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా సోమవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

భూకబ్జా చరిత్ర రంజిత్‌రెడ్డిది

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రమేష్ కుమార్ విమర్శ

తాండూరు: ఆంజనేయ స్వామి దేవాలయాన్ని పేల్చి స్థలాన్ని కబ్జా చేసిన చరిత్ర ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిదేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్ కుమార్ విమర్శలు చేశారు. సోమవారం పట్టణంలోని స్టేషన్ హనుమాన్ దేవాలయంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మంగళవారం జిల్లాలో ఉన్న ప్రతి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రజలతో కలిసి బీజేపీ నాయకులు టెంకాయలు కొట్టి.. రంజిత్‌రెడ్డిని శిక్షించాలని దేవుడిని ప్రార్థిస్తారన్నారు. బీఆర్‌ఎస్‌లో ఉండి భూ కబ్జాలు, మక్క, దాణా కుంభకోణంతో పాటు ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఇవి తప్పించుకొనేందుకే ఆయన బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరారన్నారు. నిజం నిప్పులాంటిదని అది ఎంతటి వారినైన కాల్చి వేస్తుందన్నారు. గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా బీజేపీకి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు.



హనుమాన్ దేవాలయం ఎదుట బీజేపీ నాయకులు

ఇది ఓర్వలేకే కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై విషం చిమ్ముతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, మాజీ అధ్యక్షుడు సదర్శన్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు సాహుశ్రీలత, అంతారం లలిత, బంటారం లావణ్య, బాలప్ప, జిల్లా అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్, నాయకులు విక్రమ్, భద్రేశ్వర్, జగదీష్ తదితరులున్నారు.

స్కాములా.. స్కీములా?



నవాబుపేట: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రత్నం

ప్రజలే తేల్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం విజ్ఞప్తి

నవాబుపేట: ప్రజలకు స్కాములు కావాలా.. స్కీములు కావాలో తేల్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో ఆయన కలిసి విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే స్కాములు అని, ఆపార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి... భూములు, దాణా, కోడి గుడ్ల స్కాంలు చేసి వేల కోట్లు సంపాదించాడని ఆరోపించాడు. అలాంటి వ్యక్తి గెలిస్తే ప్రజలను నిలువునా దోచుకుంటాడన్నారు. మోదీ పాలనలో దేశం ఆర్థికంగా ప్రపంచంలోనే ఐదో స్థానానికి చేరిందన్నారు. కాంగ్రెస్ 70 ఏళ్ల పాలనలో దేశం ఆర్థికంగా, రాజకీయంగా చిన్నాభిన్నం అయిందన్నారు. బీఆర్‌ఎస్ 10 ఏళ్ల పాలనలో సైతం రాష్ట్రం దివాలా తీసిందన్నారు. ఆపార్టీ నాయకులు మాత్రం కోట్లకు పడగలెత్తారన్నారు. బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి ఈ ప్రాంత బిడ్డ, మచ్చలేని మనిషి పేదలకు మేలు చేసే వ్యక్తిని గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు రామకృష్ణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహులు, గాలయ్య, జగన్, నర్సింలు, తదితరులు ఉన్నారు.

మాదిగల అండ

తాండూరు రూరల్: ఎస్సీ రిజర్వేషన్‌కు సహకారం చేస్తున్న బీజేపీకి మాదిగలు అండగా నిలవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జినుగుర్తి నర్సింహులు మాదిగ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చింతమణిపట్నం, పర్వాతపూర్‌లలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి మోదీని ప్రధాన మంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలన్నారు.

కొడంగల్ : మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో బీజేపీ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. పాలమూరు బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా ఉంటేనే దేశం భద్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సూరారం రాకేశ్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు గంటి సర్వేశ్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురి చేరిక

బంట్వారం: బీజేపీలో పలువురు నేతలు చేరారు. సోమవారం బీజేపీ నియోజకవర్గం కోఆర్డినేటర్ వడ్ల నందు ఆధ్వర్యంలో యాచారం ఎంపీటీసీ ప్రశాంతి శరణారెడ్డి, మద్వాపూర్ మాజీ సర్పంచ్ గోవింద్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బొప్పునారం నర్సింహులు.. వికారాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు నారాయణ్‌రావు పచారియా, రాజస్థాన్ ఎమ్మెల్యే చరణ్‌సింగ్ పురోహిత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవ్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

పూడూరు: మరోమారు భారతీయ జనతాపార్టీని గెలిపించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని పార్టీ మండలాధ్యక్షుడు రాఘవేందర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని సిరిగాయపల్లిలో చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు.

మాజీ సర్పంచ్ చేరిక

మర్పల్లి: మండల పరిధిలోని దామస్తాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ శాంతప్ప తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. వికారాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సమక్షంలో సోమవారం కార్యక్రమం జరిగింది. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అనంతగిరి: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు సోమవారం వికారాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు.

తాండూరు: కొండా విశ్వేశ్వరరెడ్డి తరపున మాజీ మంత్రి చందుమహరాజ్ తనయుడు నరేష్ మహరాజ్.. బషీరాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు పదవి అవసరం లేదని సామన్య కార్యకర్తలా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

మోమిన్‌పేట: దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా నాయకుడు పెద్ది నవీన్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని వెల్‌చాల్, మొరంగపల్లిల్లో పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో ఉగ్రవాదాన్ని అణిచివేస్తున్నారన్నారు. మొరంగపల్లిలో పలువురు బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు.



మోమిన్‌పేట: వెల్‌చాల్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నవీన్‌కుమార్

లోవోల్టేజీ!



పాషాపూర్ వద్ద విద్యుత్ తీగలకు కర్రల సపోర్టు

విద్యుత్ స్తంభాలు లేక, లో వోల్టేజీతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి పెద్దేముల్ మండల పాషాపూర్‌లో కనిపిస్తోంది. ఇక్కడి గిరిజన రైతులు నేటికీ కర్రలతో వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా చేసుకుంటున్నారు. ఈ విషయమై ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జైరాంతండా (తట్టెపల్లి)లో విద్యుత్ లోవోల్టేజీతో చెరకు రైతులు సైతం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

– పెద్దేముల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండలంలోని సురాయిపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ మహిపాల్ సోమవారం తెలిపారు. అయితే కుదురుమళ్ల, సురాయిపల్లి గ్రామాల్లో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్యారంటీల అమలులో విఫలం

తాండూరు టౌన్ : గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం చెందిందని వికారాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు ప్రమోదినీ రెడ్డి విమర్శించారు. చేవెళ్ల లోక్‌సభ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. సోమవారం ఆమె శ్రీభావిగి భద్రేశ్వర జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందన్నారు. ఆమెతో పాటు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీపానర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ వీణ తదితరులు ఉన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రమోదినీ రెడ్డి